

## 'మిట్స్' ప్రొఫెసర్‌కు జ్యేష్ఠ ఆచార్య అవార్డు

**ప్రజాశక్తి-మదనపల్లి**

మిట్స్ కాలేజ్ లోని (డేటా సైన్స్) విభాగాధిపతి డాక్టర్ ఎస్.కుసుమ జ్యేష్ఠ ఆచార్య అవార్డును అందుకున్నట్లు కలశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో భారత్ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులను వైజాగ్‌లోని ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. రీసెర్చ్, ఎడ్యుకేషన్ సెక్టార్‌లో డాక్టర్ ఎస్.కుసుమ చేసిన కృషిని గుర్తించి ఈ అవా ర్డును ఆమెకు అందించినట్లు పేర్కొన్నారు. అవార్డును అందు కున్నట్లు కుసుమను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అభినందనలు తెలియజేసారు.




ఆచార్య అవార్డు తీసుకున్న ప్రొఫెసర్ డాక్టర్ కుసుమ

# మామిడి రైతుకు నిరాశే..



**వాతావరణ మార్పుతో తగ్గిన దిగుబడి**

**మార్కెట్‌లో అరకొరగా అమ్మకాలు**

**కొండెక్కిన ధరలు**

**ప్రజాశక్తి-రాయచోటి**

జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల సాగు ఎక్కువగా ఉంది. ఎంతో ఆశగా మామిడి పండు సాగు చేస్తున్న రైతన్నకు సరైన గిట్టుబాటు ధరలు లేక నాలుగేళ్లుగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి రైతులకు గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలి పోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలిపోయాయి. ఇక్కడ నుండి ముంబై, చెన్నై, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తారు. గతంలో మామిడి పూతను చూసి వ్యాపారస్తులు మామిడి పంటను కొనేవారు ప్రస్తుతం మామిడికాయలను చూసి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు గతంలో మాదిరిగా వ్యాపారస్తులు ఉత్సాహం చూపడం లేదు. అనుకున్నంత ఏడాది అనుకున్నంత మామిడిపంట రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**35,867 హెక్టార్లలో మామిడి సాగు**

జిల్లా వ్యాప్తంగా 35,863 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు. రైల్వేకోడూర్‌లో 3,687 హెక్టార్లు, టి.సుండుపల్లెలో 3,036, చిన్నమండెంలో 2,500, లక్కిరెడ్డిపల్లిలో 2,400, వీరబల్లిలో 2,105, కంభంవారిపల్లెలో 1,850, చిట్వేలిలో 1,760, గుర్రంకొండలో 1,658, రామాపురంలో 1,433, పీలేరులో 1,400, కలకడలో 1,378, పెనగలూరులో 1,352, సంబేపల్లిలో 1,230, వాల్మీకిపురంలో 1,150, కలికిరిలో 1,090, గాలివీడులో 9,020, రాయచోటిలో 890, నిమ్మనపల్లిలో 820, పెద్దమండ్యంలో 784, నందలూరులో 712, ఓబులవారిపల్లిలో 650, రామసముద్రంలో 600, మదనపల్లిలో 690, రాజంపేటలో 374, కురబలకోటలో 300, తంబళ్లపల్లెలో 300, బి.కొత్తకోటలో 286, మొలకలచెరువులో 250, పెద్దతిప్పసముద్రంలో 217, పుల్లంపేటలో 196 హెక్టార్లలో మామిడి పంటను రైతులు సాగు చేశారు.

**మార్కెట్లో కానరాన్ని మామిడి పండ్లు..**

మామిడి ధరలు ఎండలతో సమానంగా మండిపోతున్నాయి. మార్కెట్లో ఎక్కడ చూసినా కూడా మామిడి పండ్లు కనిపించడం లేదు. ఒకవేళ కనిపించినా చాలా తక్కువ మోతాదులో మామిడి కాయలు ఉంటున్నాయి. మార్చి చివరి వారం నుంచి మే వరకు మార్కెట్ మొత్తం మామిడి పండ్లు కనిపిస్తాయి. ఈసారి మామిడి దిగుబడి తగ్గడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని వ్యాపారులు చెబుతున్నారు. పూత రాకపోవడం వచ్చినా కూడా రాలిపోవడంతో మామిడి దిగుబడిపై ప్రభావం పడింది.గతం లో శీతాకాలంలో మామిడి చెట్లకు దట్టంగా పూత వచ్చిన ఆ తర్వాత వాతావరణంలో మార్పులు కారణంగా నిలబడక పోవడం, నాసిరకమైన మందులు ప్రభావంతో పూత నిలబడలేదని రైతులు వాపోతున్నారు. దీనికి కారణంగానే మార్కెట్లో ఎక్కడ మామిడి పండ్లు కనిపించడం లేదు. అరకురా కొన్ని మామిడి పండ్లు కనిపించిన ఆ పండ్లు కూడా కిలో రూ.80 నుంచి రూ.180 వరకు మార్కెట్‌లో అమ్ముతున్నారు.

మామిడి రైతులకు ఈ ఏడాది కన్నీళ్లే మిగులుతున్నాయి. కష్టనష్టాలకు ఓర్చుకుని ఏళ్ల తరబడి తోటలను సాగు చేస్తున్నా.. మామిడి పంట దిగుబడి రావడం లేదు. వాతావరణంలో మార్పులు మామిడిపై తీవ్రంగా ఉండడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు రాలి పోయాయి. వేసవి వచ్చిందంటే పండ్లలో రారాజుగా పిలవబడే మామిడిని రుచి చూడని వారు ఉండరు. అలాంటిది ప్రస్తుత మామిడి కాయలు కనిపించడం లేదు. అరకొర మామిడికాయలు మార్కెట్లో దర్శనమిస్తే వాటి ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు మామిడి కాయలను కొనాలంటే జంకుతున్నారు. మామిడి కిలో రూ.80 నుంచి రూ.180 వరకు మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈసారి మామిడి దిగుబడి బాగా తగ్గడంతోనే ధరలు పెరిగిపోయాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.





మండీలో విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు

**వెలవెల పోతున్న మామిడి మండీలు**

జిల్లాలో మామిడి కాయలను విక్రయించేందుకు పలు మండీలు ఉన్నాయి. రైతులు, వ్యాపారస్తులు మామిడి కాయలను ఈ మండీలకు చేరవేసి అమ్ముకుంటుంటారు. ప్రస్తుతం మామిడి దిగుబడి తగ్గడంతో మండీలకు మామిడికాయలు రాకపోవడంతో మామిడి మండీలు వెలవెల పోతున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఒక్క కొంతమంది వ్యాపారులు మామిడి షెడ్లను ఏర్పాటు చేశారు. ఆయా మండలాలలోని రైతులు ఆ మామిడి షెడ్లకు మామిడి కాయలను తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఆ షెడ్లకు కూడా కాయలు రాకపోవడంతో అవి కూడా వెలవెల పోతున్నాయి.

**వీరబల్లి బేనీషాకు భలే గిరాకీ**

ప్రతి ఒక్కరికీ వీరబల్లి బేనీషా అంటే మహా ఇష్టం. ఈ బేనీషా చాలా రుచిగా ఉంటుంది. ఈ బేనీషాను కొనుగోలు చేయడానికి ఢిల్లీ, ముంబై, కలకత్తా ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు. ఈ వీరబల్లి బేనీషాను మన రాష్ట్రమే కాదు విదేశాలు కూడా ఎగుమతి చేస్తుంటారు. ఈ బేనీషాకు అంత పేరు వచ్చిందని చెప్పవచ్చును. వీరబల్లి మండలంలో మామిడి తోటలో అధికంగా ఉన్నాయి. అందుకోసమే మామిడి ప్రియులు ఈ వీరబల్లి బెనిషను ఇష్టపడతారు.

**అధికంగా ఖర్చవుతోంది**



మామిడి పంట సాగు చేయాలంటే అధిక ఖర్చు వస్తుం ది. మామిడి చెట్లకు దుక్కి, నీరు కట్టడం, ఎరువులకు అధికంగా ఖర్చ వుతోంది. కూలీలు కూడా ఎక్కువ య్యాయి. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. ఇంత కష్టపడినప్పటికీ నాలుగేళ్లుగా మామిడి పంట సరిగ్గా రావడం లేదు. పెట్టుబడి ఎక్కువ అవుతుంది. ఆదాయం తగ్గుతున్నది. ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు న్యాయం చేయాలి.

**- రెడ్డప్ప రైతు, మాధవరం, రాయచోటి మండలం.**

**ప్రభుత్వం ఆదుకోవాలి**



జిల్లాలో మామిడి సాగు చేసిన ప్రతి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతులకు కూలీలు ఖర్చులు అధికమవుతున్నాయి. మామిడి పంట కూడా తక్కువగా వస్తున్నది. మామిడి చెట్లు ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. నష్టపరిహారం కూడా అందించాలి.

**- సిరిపురి రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.**

**ఈ ఏడాది పూత తక్కువ**



వాతావరణం మార్పుల వలన ఈ ఏడాది పూత లేటుగా, తక్కువగా వచ్చింది. వర్షాలు కూడా తక్కువగానే పడ్డాయి. జిఖరీఫ్ మొదటలో జూన్ మాసంలో రైతులు మామిడి చెట్ల కత్తిరింపులు, దున్నకాలు చెట్లకు పాదులు వంటివి చేసుకోవాలి.

**- పి.రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, రాయచోటి.**

## కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్**



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

**ప్రజాశక్తి-రాయచోటి**

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు ప్రణాళిక బద్ధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, జిల్లా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, సాఫీగా విజయవంతంగా ముగిసిందని ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. జూన్ 4న నిర్వహించే ఎన్నికల ఓట్ల లెక్కింపు నిమిత్తం అన్ని విధాల సంసిద్ధంగా ఉండాలని, ఇందుకోసం ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నిబంధనల మేరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో కౌంటింగ్ ప్రక్రియను మొదలు పెట్టాలని, 8.30 గంటల నుంచి ఇవిఎంల కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ కౌంటింగ్ ప్రక్రియపై జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి ఎక్కడ కూడా ఎలాంటి లోటు పాట్లకు ఆస్కారం ఇవ్వకుండా అన్ని ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేసుకోవాలన్నారు. కౌంటింగ్ హాలులో నిబంధనల మేరకు వసతులు ఏర్పాటు చేసుకోవాలని కౌంటింగ్ కేంద్రాల్లో బ్యారికేడింగ్, ఆర్ఓ టేబుల్, కౌంటింగ్ స్టాఫ్ టేబుల్స్, ఏజెంట్ల సీటింగ్, లైట్లు, ఫ్యాన్లు, కంప్యూ టర్ సిస్టమ్స్, ఇంటర్నెట్ తదితర అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని ఆదేశించారు. అబ్జర్వర్ల లాంజ్ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేకంగా బ్యారికేడింగ్ ఉండాలని, కౌంటింగ్ కేంద్రం లో స్ట్రాంగ్ రూము నుంచి ఇవిఎంలను కౌంటింగ్ హాలుకు తీసుకొచ్చే దారిలో బ్యారికేడింగ్‌తో పాటు సిసి కెమెరాలు ఉండాలని, కౌంటింగ్ హాలులోకి ప్రవేశించేందుకు అధికారులకు, ఏజెంట్లకు విడిగా బ్యారికేడింగ్ ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో నిర్దేశిత ప్రాంతంలో మీడియా కేంద్రం ఏర్పాటు చేయాలని ఆయా నియోజకవర్గాల రౌండ్ వారి ఫలితాల ప్రకటనలను మీడియా కేంద్రానికి వెనువెంటనే పంపాలని ఆర్వోలకు సూచించారు. కౌంటింగ్ కేంద్రానికి అవసరమైన లైటింగ్ ఏర్పాటుతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని, ఇందుకు తగ్గిన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆహారం, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

**కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ**

ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ల అందరికీ తగిన శిక్షణ ఇవ్వాలని ఇందుకు షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజు ఎక్కడ కూడా కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు ప్రక్రియ ఆగరాదు. వర్షం సూచన ఉన్నందున కౌంటింగ్ కేంద్రాల వద్ద రెయిన్ ప్రూఫింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు.కౌంటింగ్ ప్రక్రియను శాంతి యుతంగా ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డిఆర్ఓ సత్యనారాయణరావు, నియోజకవర్గాల ఆర్ఓ, ఎఆర్ఓ జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## 16 నెలల పెండింగ్ వేతనాలివ్వాలి

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు**



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 16 నెలల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ లోని ఎ.పి.కమ్యూనిటీ నాచురల్ పార్మింగ్ విభాగంలో ఐసిఆర్‌పి, ఎల్ 1, ఎల్ 2, మాస్టర్ ట్రైనర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వాలు అతి తక్కువ వేతనాలతో పని చేయించుకోవడమే గాక గత 16 నెలలుగా చేసిన పనికి వేతనం ఇవ్వకపోవడం వలన దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వారు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనేక రకాలుగా బటన్‌లు నొక్కి అన్ని రంగాల వారికీ డబ్బులు విడుదల చేస్తున్న ప్రభుత్వం వీరికి జీతం ఇకపోవడం సరైన పద్దతి కాదని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక అప్పుల బారిన పడిన వీరికి వెంటనే పెండింగ్ వేతనాలిచ్చి అప్పుల నుండి కాపాడాలని చెప్పారు. పెండింగ్ వేతనాల కోసం, సకాలంలో వేతనాలిచ్చి ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాల కొరకు భవిష్యత్‌లో సిఐటియు ఆధ్వర్యాన పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.వి.రమణ, జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఫయాజ్ పాల్గొన్నారు.

## పెన్నా నదికి జలకళ

**ప్రజాశక్తి-చెన్నూరు**

ఎగువ ప్రాంతాల్లో కురిసన వర్షాలకు ఓ మోస్తరు వర్షాలకు కుందూ నదికి భారీగా వర్షపు నీరు చేరడంతో పెన్నానదికి వచ్చి చేరుతుండటంతో జలకళ సంతరించుకుంది. పెన్నా నది ఎగువ ప్రాంతంలో ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కమలాపురం ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో పెన్నా నదిలోకి వర్షం నీరు పరుగులు పెడుతోంది. వల్లూరు మండలంలోని ఆదినిమ్మయపల్లి వద్ద పెన్నా నదిపై నిర్మించిన ఆనకట్ట వద్ద నీటికల సంచరించుకుంది. ఆనకట్ట నుంచి పెన్నా నదిలోకి నీరు చేరుతోంది. అక్కడ నుంచి చెన్నూరుకు నీరు నెమ్మదిగా కొనసాగుతున్నది. పెన్నా నదిలో ఇసుక అక్రమ తవ్వకాల కారణంగా పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అక్కడ నీరు నిలిచిపోవడంతో నీటి ప్రవాహం తక్కువగా కొనసాగుతున్నది. చెన్నూరు-కొండపేట పెన్నా నది వంతెన వద్దకు నీటి ప్రవాహం కొనసాగుతోంది. పెన్నా నదికి నేటి ప్రవాహం కొనసాగుతుండడంతో చెన్నూరు, కొండపేట, కుక్కరాయపల్లి, బలిసింగాయపల్లి, కనపర్తి, ఓబులంపల్లి, రామనపల్లి గ్రామాల పరిసర ప్రాంతాల్లో బోర్లతో పాటు వ్యవసాయం బోర్లలో నీటి సామర్థ్యం పెరుగేందుకు ఆస్కారం ఉందని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుంచి చుక్క నీరులేని పెన్నా నదిలో నీరు నాలుగు నెలలకు పెన్నా నదిలో నేటి ప్రవాహం కనిపించింది. పెన్నా నది పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలకు ఊరటనిచ్చింది.



పెన్నా నదిలో ప్రవహిస్తున్న నీరు

## 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాశక్తి రాయచోటి**



మాట్లాడుతున్న డిఆర్ఓ సత్యనారాయణ

ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9.00 గంగత నుంచి 12.00 గంగత వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల కోసం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలోలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ప్రకాష్, అమరేంద్ర కుమార్, నాగ సురేష్, హెల్త్, పోస్టల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, లేబర్, ఆర్టీసీ, విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి- రాజంపేట అర్బన్**

అన్నమయ్య డ్యాంలోని ఫిల్టర్ల ద్వారా రాజంపేట పట్టణానికి సరఫరా అయ్యే మంచి నీటికి మంగళ, బుధవారాల్లో రెండురోజుల పాటు అంతరాయం కలగనుంది. మండలంలోని బోయినపల్లె వై జంక్షన్ వద్ద 400 ఎంఎం మెయిన్ పైపులైన్ లీకేజీ అవుతున్న కారణంగా మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉన్నందున రెండు రోజులు పట్టణానికి నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంతరాయానికి పట్టణ ప్రజలు సహకరించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని కమిషనర్ కోరారు.

## ఇంటర్ వర్సిటీ పోటీలకు సిఎన్‌ఆర్ విద్యార్థి విష్ణువర్ధన్



**ప్రజాశక్తి-పీలేరు :** ఇంటర్ వర్సిటీ పోటీలకు పీలేరు సిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థి విష్ణువర్ధన్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ సి.విజయ భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. విష్ణు తమ కళాశాలలో బికామ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడని, ఇటీవల యూనివర్సిటీ పరిధిలో జరిగిన పోటీల్లో ఇతను ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 31న చెన్నైలో జరిగే పోటీలకు ఎస్‌వియు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. విష్ణు ఎంపిక పట్ల అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

## అక్రమ బ్లాస్టింగ్‌పై చర్యలు తీసుకోవాలి

**- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు**



నిరసన తెలియజేస్తున్న శ్రీనివాసులు, కాలనీ వాసులు

**ప్రజాశక్తి-మదనపల్లి**

అక్రమ బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అమ్మచెరువుమిట్ట వద్ద వెలుగు ప్రత్యేక పాఠశాల వెనుక వైపున జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్రమ బ్లాస్టింగ్ ఆపాలి, బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి, కబ్జాదారులకు అండగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, ఐటియుసి నాయకులు జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ మదనపల్లి మండలం కోళ్లబైలు రెవెన్యూ గ్రామంలో భూ కబ్జాలకు అక్రమాలకు అంతే లేకుండా పోయిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల మధ్యలో అర్ధరాత్రి పూట సర్వేనెంబర్ 529లో ఉన్న గుట్టలో బ్లాస్టింగ్లు చేయడం వలన భూమి కంపించి ఇల్లు కదులుతున్నాయని పేర్కొన్నారు. వెలుగు స్కూల్‌లో ఉన్న మానసిక వికలాంగులు వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కబ్జాదారులకు అధికారుల వత్తాసు పలకడం వలనే అక్రమ బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయన్నారు. కలెక్టర్, ఆర్‌డిఓ స్పందించి అక్రమ బ్లాస్టింగ్ ఆపాలని లేనిపక్షంలో ప్రజలందరినీ కూడగట్టి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైయస్సార్ నగర్, బృందావన్ కాలనీ, జగన్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## 23 నుంచి అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**



అన్నమాచార్యుల 108 అడుగుల విగ్రహం


పద కవితా పితామహుడు, తొలి వాగ్గేయకారుడు శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 616వ వర్ధంతి ఉత్సవాలు తాళ్లపాక, బోయినపల్లిలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. 23వ తేదీ ఉదయం 9 గంటలకు తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే గోష్టి గానం, సప్తగిరుల సంకీర్తనం ఉంటుంది. 10.30 గంటలకు శ్రీనివాస కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు ఉదయం భాస్కర్, హేమమాలిని బృందంచే సంగీత సభ, సాయంత్రం 6.30 గంటలకు అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద శ్రీవారికి ఊంజల సేవ, 7 గంటలకు వై.శ్రీనివాస్, ఎం.లక్ష్మీ కుమారి బృందంతో హరికథ కార్యక్రమాలు ఉంటాయి. 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు తాళ్లపాకలో సుబ్రహ్మణ్యం, దేవిక, ఆర్.శ్యాం కుమార్, తులసి భాయి బృందం వారిచే సంగీత సభలు, రాత్రి 7 గంటలకు జి.అనసూయ, జి.వనజ కుమారిలచే హరికథ కాలక్షేపం ఉంటుంది. 25వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఎం.రవిచంద్ర, ఎ.మోనాలిని బృందంచే సంగీత సభ, రాత్రి 7 గంటలకు ఎం.మాధవి బృందం వారిచే తాళ్లపాకలో హరికథ, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద శ్రీ కోదండరామ కళానాట్యమండలి బృందం బోయినపల్లె వారిచే ప్రత్యేక నాటక ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయి. రాజంపేట చుట్టుపక్కల ప్రాంత ప్రజలు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఈ సందర్భంగా కోరారు.

# పర్యాటకులను ఆకర్షిస్తున్న 'హార్సిలీహిల్స్'

- ప్రఖ్యాత వేసవి విడిది కేంద్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి
- పేదవాడి ఆంధ్రా ఊటీగా గుర్తింపు
- ప్రకృతి అందాల ఒడిలో పరవశిస్తున్న పర్యాటకులు



హార్సిలీహిల్స్ గవర్నర్ బంగ్లా



గాలిబండ






బోటింగ్ ప్రయాణంలో పర్యాటకులు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

అన్నమయ్య జిల్లాలోని బి.కొత్తకోట మండలం పరిధిలోని హార్సిలీహిల్స్ సుదీర్ఘ చరిత్ర కలిగిన పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెంది,ఆంధ్రా ఊటీగా ప్రఖ్యాతి గడించింది. హార్సిలీహిల్స్ ప్రకృతి అందాలకు నెలవుగా, ఆహ్లాదకరమైన వాతావరణానికి మారుపేరుగా నిలుస్తోంది.పేదవాడి ఆంధ్రా ఊటీ హార్సిలీహిల్స్ 42 డిగ్రీల వేసవిలోనే చల్లదనాన్ని పంచుతోంది. పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తూ వారిని మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ఒత్తిడితో ప్రజాజీవనం యాంత్రికంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో ప్రకృతి అందాల మధ్య గడిపి మధురానుభూతుల్ని మిగిల్చుకునే అవకాశాన్ని ఈ పర్యాటక కేంద్రం కల్పిస్తోందనడం అతిశయోక్తి లేదు. కోటావూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రకృతి రమణీయంగా హార్సిలీహిల్స్ ఉంది. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్న హార్సిలీహిల్స్‌లో నడివేసవిలోను ఉష్ణోగ్రత 32 డిగ్రీలకు మించకపోవడం విశేషం. ప్రకృతి ప్రసాదించిన అందాలను ద్విగుణీకృతం చేసే విధంగా ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్ర మాలను చేపట్టింది. ప్రతి ఏడాది రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అడ్వెంచర్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పర్యాటకులను ఆకర్షిస్తోంది. అందుకే పర్యాటకుల తాకిడి రోజురోజుకూ క్రమంగా పుంజుకుంటోంది.1865-67 మధ్య కాలంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేసిన డబ్ల్యూడి హార్సిలీ 1870 ప్రాంతంలో కడప కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.ఏనుగు మల్లమ్మ కొండగా పిలువబడే ఈ ప్రాంతాన్ని చూసి ఆకర్షితుడ య్యాడు.తొలిసారిగా అతిథి గృహాన్ని నిర్మించి క్రమంగా అభివృద్ధి చేశారు. తదనంతర కాలంలో హార్సిలీహిల్స్‌గా ప్రఖ్యాతి పొందింది. కొండపైకి వచ్చే పర్యాటకులు రెండు వేర్వేరు ప్రాంతాలలో ఉన్న పాయింట్ల నుంచి ప్రకృతి అందాలను చూడ వచ్చు.ఇక్కడ ఉన్న మొసళ్ళ పార్కు, ప్రకృతి అధ్యాయన కేంద్రం, ఏనుగు మల్లమ్మ ఆలయం, గాలిబండ, గవర్నర్ బంగ్లా, గంగోత్రి, మానస సరోవరాలతోపాటు ఉద్యానవనాలను చూడవచ్చు.ఆటవీశాఖ గృహ ఆవరణంలో 1899 సంవత్సరంలో నాటిన నీలగిరి వృక్షం ఉంది.కేంద్ర ప్రభుత్వం ఈ నీలగిరి చెట్టుకు "మహా వృక్ష" పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది.సముద్రంలో ఉంచే మొసళ్లను 4312 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై పెంచడం మరో విశేషం.ఈ ఆటవీ ప్రాంతంలో ఔత్సాహికులు ట్రెకింగ్ చేసుకోవచ్చు.చిన్న పిల్లలు ఆడుకోవడానికి పార్కులు అందుబాటులో ఉన్నాయి. హార్సిలీహిల్స్ ఘాట్ రోడ్డులో వివిధ రకాల జంతు వులు, పక్షులు, వృక్షాలను చూస్తూ సాగే ప్రయాణం మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. కొండపై నుంచి కిందకు వెళ్లడానికి కాలినడక మార్గాలలో ప్రయా ణాన్ని గ్రామీణులు బాగా ఇష్టపడతారు. హార్సిలీహిల్స్ పరిసర ప్రాంతాలలో అప్పుడప్పుడు సినిమా షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, వివిధ సంస్థల వార్షికోత్సవ, ప్రారంభ కార్యక్రమాలను నిర్వహించుకుంటుంటారు .సినీనటులను చూసేందుకు వచ్చే పర్యాటకులతో కొండ కళకళాడుతుంటుంది. మదనపల్లెలో జన్మించి ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్తగా రాణించిన జిడ్డు క్రిష్ణమూర్తి స్మారకార్థం ఆయన విగ్రహాన్ని కొండపైన ఏర్పాటు చేశారు. స్వామి వివేకానందుని విగ్రహం ఉంది.అదేవిధంగా జిడ్డు కృష్ణమూర్తి మానసపుత్రిక రిషివ్యాలీ ఇంటర్నేషనల్ పాఠశాల హిల్స్‌కు సమీపంలో తెట్టు గ్రామంలో ఉంది.ఈ పాఠశాలలో దేశ, విదేశాల విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. హార్సిలీహిల్స్‌లోని అందాలను ఆస్వాదిస్తే ఆ అనుభూతి వేరంటున్నారు ప్రకృతి ప్రేమికులు.



సాయంకాలం వేళ రమణీయంగా హార్సిలీహిల్స్ ప్రకృతి

### హార్సిలీహిల్స్ టౌన్‌షిప్‌కు జీవం

జిల్లాల పునర్విభజన అనంతరం హార్సిలీహిల్స్ అన్నమయ్య జిల్లాలో భాగమైంది.ఇందుకు చిహ్నంగా కొండపై శ్రీవారి మూడు నామాలను ముద్రించడం జరిగింది. హార్సిలీహిల్స్ అభివృద్ధిపై మంత్రి రోజా ప్రత్యేక శ్రద్ధవహించి ప్రత్యేక చొరవ చూపారు.ఈ నేపథ్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి కార్యకలాపాలు లేకుండా ఉన్న హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీకి గతంలో పనిచేసనకలెక్టర్ పి.ఎస్.గిరీష జీవం పోశారు.హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ అధికారులను మేల్కొలిపి కొండ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కొండపై ఆక్రమణలు,అక్రమాలకు చెక్ పెట్టేందుకు పలు మార్గాలను సూచించారు.ఏ ఆశయంతో 2001లో హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ ఏర్పాటైదోఆఆశయం నెరవేర్చే దిశగా పర్యాటక అధికారులు అడుగులు వేస్తున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మి

## హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

**- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మి**

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

హైరిస్క్ గర్భిణులను వీలైనంత త్వరగా గుర్తించాలని మదనపల్లి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద నిర్వహించిన 104 వాహన వైద్య శిబిరాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం నిమ్మనపల్లి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రికార్డులను, రోగుల ఒపి రిజిస్టార్‌ను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్ ప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామా లలో 104 వాహన ద్వారా వైద్యశిబిరాలను నిర్వహించాలని సూచించారు. 12 వారాల లోపు గర్భిణులను గుర్తించాలని అన్నారు. వీలైనంత త్వరగా హై రిస్క్ గర్భవతులను గుర్తించి, వైద్యుల సూచనల మేరకు వారు ఆరోగ్య నియమాలను పాటించేలా చర్యలు తీసుకో వాల న్నారు. కాన్పులను ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేయించేలా గర్భిణులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. వారిలో రక్తహీనత లేకుండా పోషకా హారంతో పాటు తగు జాగ్రత్తలు తీసుకునేలా సలహాలు, సూచనలు ఎప్ప టిక ప్పుడు అందివ్వాలని తెలిపారు. 104వాహన వైద్య సేవ కార్యక్రమాల ద్వారా గ్రా మాలలోని వృద్ధులకు, ఇతర ఆరోగ్య సమ స్యలతో బాధపడే వారికి బిపి, షుగర్ వంటి ప్రాథమిక వైద్య పరీక్షలను నిర్వహించి, అందుకు తగిన చికిత్సలను, మందు లను వైద్యులు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్, హెల్త్ అసి స్టెంట్ కిరణ్, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎం చెన్నమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కలికిరి మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-కలికిరి**

కలికిరి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగునున్నట్లు ఎంపిడిఒ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లి నూర్జహాన్ ఆధ్వర్యంలో మండల సమావేశ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుంద తెలిపారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి పద్మజాల లోక వర్ధన్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు హాజరవుతారని కావున ప్రభుత్వ అధికారులు తమ శాఖ పరమైన సమాచారంతో సభకు హాజరు కావాలనిసూచించారు.

## మాటతప్పని నాయకుడు సిఎం జగన్ : 'గడికోట'

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

ప్రజలకు ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకున్న ఒకే ఒక్క నాయకుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వివిధ సంక్షేమ లబ్ధిదారులకు సుమారు రూ.10 వేల కోట్లు అందితే ప్రజల్లో మరింత ప్రజాదరణ పెరిగి జగన్ కు ఓట్లు వేస్తారన్న అక్కసుతో కొంతమంది కుట్రదారులు పన్నాగం పొందారని అన్నారు. ముందే జమ కావాల్సిన డబ్బులపై కోర్టులకు వెళ్లడం, ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి నిలుపుదల చేశారని చెప్పారు. విద్యాదీవెన, ఈ బిసి నేస్తం, పెండింగ్ ఉన్న ఆసరా, చేయూత, రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ, రైతులకు పెట్టుబడి నిధి తదితర పథకాల నిధులు వారం పదిరోజుల్లో అక్క చెల్లెమ్మలు, రైతులందరి ఖాతా లలో జమ కానుండడంపై సంతోషంగా ఉందన్నారు.



ఎన్‌టిఆర్ జన్మదిన వేడుకల్లో అభిమానులు

## అన్నదానం గొప్పది


**ప్రజాశక్తి-వాల్మీకిపురం**

పట్టణంలోని గంగమ్మ గుడివీధిలో ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జూనియర్ ఎన్‌టిఆర్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అక్షరాలతో తయారు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌టిఆర్‌ను ఆదర్శంగా తీసుకొని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతామని అన్నారు. ఎన్‌టిఆర్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని బ్లాక్ బస్టర్ సినిమాలను తీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భార్గవ్, వినయ్, అశోక్, సాయి, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

## మల్లయ్య కొండపై భక్తుల సందడి

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రావ డం విశేషం. భక్తుల సౌకర్యార్థం మదనపల్లె వన్ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి తంబళ్లపల్లె నుండి మల్లయ్య కొండపైకి రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సులు తిరగడంతో భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.



నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

## నాయకులు, కార్యకర్తల కృషి మరువలేనిది

**- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి**

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

సాధారణ ఎన్నికలలో ఎన్నికల సందర్భంగా వైసిపి విజయానికి పెద్ద మండ్యం మండలంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు చేసిన కృషి మరువలేనిదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే స్వగృహంలో పెద్ద మండ్యం మండలానికి చెందిన నాయకులు కార్యకర్తలతో చర్చించారు. వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో నాయకులు రెడ్డప్పరెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లి కార్జున, నరసింహులు,సత్యనారాయణ రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు రెడ్డి, అశోక్ రెడ్డిలు ఉన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాశక్తి-వేంపల్లె**

స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య కోసం పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి ఉర్దూతో పాటు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు కూడా ఆడ్మిషన్లు పొందేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సెకండ్ లాంగ్వేజ్ కింద ఉర్దూ, తెలుగు తీసుకోవచ్చు అన్నారు. మరిన్ని విషయాల కోసం కళాశాల ప్రిన్సిపల్ ను సంప్రదించాలని ఆయన కోరారు.

## పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

**ప్రజాశక్తి-కలికిరి**

మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్యం పడకేసింది. తద్వారా అన్ని గ్రామాల్లో పరిస రాలన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయి. అపరిశుభ్రతతో అంటువ్యాధులు ప్రభలు తాయని గ్రామ స్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహి స్తుంటే గ్రామాలు మాత్రం అధికారుల నిర్లక్ష్యంతో బురద గుంటల్లా మారుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకు పాలన తేవాలని, ప్రజా సమస్యలు తీర్చాలని గ్రామ సచివాలయాలను నెలకొల్పి సచివాలయ ఉద్యోగులను కూడా నియమించారని అన్నారు. ప్రజా సమ స్యల పరిష్కారంలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని వాపోతున్నారు. ఇకనైనా అధి కారులు మేల్కొని రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మురుగునీటి కాలువలు శుభ్రం చేసి, పారిశుధ్య సమస్యను పరిష్కరించి అంటు వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.



కె.బర్నేపల్లిలో అపరిశుభ్రంగా ఉన్న మురుగునీటి కాలువ

## అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ పరిశీలన



అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ ను పరిశీలిస్తున్న దేవశిరోమణి

**ప్రజాశక్తి-నందలూరు**

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరఫరా చేసిన అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్‌ను డిప్యూటి డిఎంహెచ్ఒ దేవశిరోమణి పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ స్కానింగ్ మిషన్ త్వరలోనే ప్రారంభించి రోగులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతినెల 9,10వ తేదీలలో నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గర్భిణులకు స్కానింగ్ నిర్వహించిన తర్వాత లింగ నిర్ధారణ చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ డి.కార్తీక్‌విశ్వనాథ్, సిహెచ్ఒ వెంకట నారాయణ , హెల్త్ ఎడ్యుకేటర్ ఉషారాణి, పిహెచ్ఎన్ శైలజ, సూపర్వైజర్లు నాగమల్లయ్య , సునీల్, ఎంఎల్‌హెచ్‌పి ఆరిఫ్, పాల్గొన్నారు.

## ఐటిఐ విద్యతో ఉపాధి అవకాశాలు

**ప్రజాశక్తి - వేంపల్లె**

పారిశ్రామిక రంగానికి ఐటిఐ విద్యార్థుల అవశ్యకత ఎంతో ఉందని వేంపల్లె కందుల ఓబుల్‌రెడ్డి ఐటిఐ ప్రిన్సిపల్ ప్రసాద్ రావు అన్నారు. సోమవారం వేంపల్లెలోని ఐటిఐలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ విద్యార్థి పదో తరగతి పూర్తి చేసిన వెంటనే ఐటిఐ విద్యను అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నట్లు చెప్పారు. మిగిలిన కోర్సుల కంటే ఐటిఐ అభ్యర్థులకే ఉపాధి అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందే కొద్ది అవకాశాలు మరింత మెరుగు పడుతున్నట్లు చెప్పారు. ఐటిఐ చదివిన విద్యార్థులకు ప్రారంభంలోనే రూ. 16 వేల జీతంతో పరిశ్రమలు తీసుకొంటున్నట్లు చెప్పారు. సాంకేతిక రంగానికి ఉన్నంత డిమాండ్ మరో రంగానికి ఉండదని తెలిపారు. మిగిలిన కోర్సులలో డిగ్రీ పూర్తి చేస్తేనే ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే ఉన్నట్లు చెప్పారు. ఐటిఐ అభ్యర్థులు పని చేయడానికి సిద్ధపడితే తిరుపతి, బెంగళూరు, చెన్నై, శ్రీసీటితో పాటు అయా జిల్లాలోని పరిశ్రమల్లో పని చేయడానికి అభ్యర్థులను తీసుకొంటున్నట్లు చెప్పారు. ఈ మధ్య కాలంలో ఎక్కువ కంపెనీలు ఐటిఐ విద్యార్థులు కావాలంటూ తమను సంప్రదిస్తున్నట్లు చెప్పారు. ఇతర రంగానికి డిమాండ్ లేనట్లు చెప్పారు. పదోతరగతి పాసు, లేక ఫెయిల్ అయిన విద్యార్థులకు ఐటిఐలో ఆడ్మిషన్లు ఉంటాయని చెప్పారు. చాలా మంది విద్యార్థులు ఇంటర్ చదివి పాసు, లేదా ఫెయిల్ అయిన తర్వాత చేరుతున్నట్లు చెప్పారు. దానికి బదులుగా పదోతరగతి పూర్తి అయిన వెంటనే ఐటిఐలో చేరి సర్టిఫికెట్లు పొందితే రెండు సంవత్సరాల కాలం వృథా కాదు అన్నారు. ఐటిఐలో అడ్మిషన్లు పక్రియ ప్రారంభం అయ్యిందని చెప్పారు. ఉత్సహవంతులైన విద్యార్థులకు విదేశాల్లోనూ ఎక్కువ జీతంతో ఉపాధి అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో చిన్న వయస్సులో ఉద్యోగ అర్హత కలిగే చదువులు ఐటిఐ విద్య అన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఐటిఐ ప్రాధాన్యతను గుర్తించాలని కోరారు. అడ్మిషన్లు వివరాలకు వేంపల్లె ఐటిఐలో సంప్రదించాలని కోరారు.

## మాజీ ముఖ్యమంత్రులకు ఘన నివాళి

**ప్రజాశక్తి - వేంపల్లె**

మాజీ ముఖ్యమంత్రులైన ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు, బ్రహ్మానందరెడ్డిలకు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రకేసరి 67వ, బ్రహ్మానందరెడ్డి 30వ వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సందర్భంగా పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పంతులు స్వతంత్ర సమరయోధుడుగా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా సమెక్య మద్రాసు ముఖ్యమంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇటు రాష్ట్రానికి, దేశానికి, అటు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవా చేసినట్లు చెప్పారు. సైమన్ కమిషన్‌కు ఎదురొడ్డి నిలిచి ఆంధ్రకేసరిగా పేరు తెచ్చుకున్నారని చెప్పారు. విజయవాడ వద్ద కృష్ణా నదిపై నిర్మించిన ప్రకాశం బ్యారేజీ ఆయన మానస పుత్రిక అన్నారు. నిరాడంబరతకు పేరుగాంచిన వ్యక్తి ప్రకాశం పంతులు అన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి కూడా గొప్ప పరిపాలనాదక్షులన్నారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా అటు దేశానికి, రాష్ట్రానికి సేవా చేసినట్లు చెప్పారు. సిసలైన సమైక్యవాది అన్నారు. బిసిలకు విద్య, ఉద్యోగాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించిన మహనీయుడు అన్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి వల్ల బిసిలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకొని విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, అమర్, బాలం సుబ్బరాయుడు, వినయ్, శివ, రాజా, ఉత్తన్న పాల్గొన్నారు.

## గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి - చాపాడు**

ప్రతి ఒక్కరూ గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ శాఖ అధికారి జె.సి.శివశంకర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథలయ శాఖ అధికారి తెలిపారు. సోమవారం విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. రాష్ట్రాలు, రాజధానులు కొన్ని జనరల్ నాలెడ్జ్ అంశాలను గ్రంథాలయ శాఖ అధికారి వివరించారు. జూన్ 7 వరకు తరగతులు నిర్వహిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. కథలు, సైన్స్, విజ్ఞాన వినోద అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల రోజున చోటు చేసుకున్న గొడవలు దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్తగా కౌనెలింగ్ ఇచ్చామని చెప్పారు. సోషల్ మీడియాలో వాట్సాప్,ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపుల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ర్యాలీలు, బాణాసంచా పేల్చేందుకు అనుమతి లేదన్నారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## 27 నుంచి ఉచిత శిక్షణ

**కడప :** కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడి యోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్ లలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఈనెల 27 నుండి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ నిర్వహి స్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు సద్విని యోగం చేసుకోవాలని కోరా రు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించను న్నట్లు తెలిపారు. 94409 05478లో సంప్రదిం చాలన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**ప్రజాశక్తి - ముద్దనూరు**

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ ఎన్నికల రోజున చోటు చేసుకున్న గొడవలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్‌పి ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు.అవాంఛనీయ సంఘటనలు నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. వాహనాల్లో ఆయుధాలు రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం అర్బన్ ఎస్ఐ అరుణ్ రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేస్తున్నామని అన్నారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన రికార్డులు కచ్చితంగా పెట్టుకోవాలన్నారు.



రెడ్డివారిపల్లికి చేరిన వేరుశనగ విత్తన కాయలు

## మండలానికి చేరిన వేరుశనగ విత్తన కాయలు

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయటానికి అవసరమైన వేరుశెనగ విత్తన కాయలు మండలానికి చేరుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశెనగ పంటను సాగు చేస్తారని అన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 2500 ఎకరాలకు పైగా రైతులు సాగు చేయడానికి సిద్ధంచేస్తున్నట్లు గుర్తించామని అన్నారు. అందుకు అవసరమైన వేరుశనగ విత్తన కాయలను ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించడానికి సిద్ధం చేస్తున్నాదని వివరించారు. ప్రస్తుతం మండలానికి (తెల్ల రకం) కే6-500 క్వింటాలు, (ఎర్ర రకం) నారాయణి-1100 క్వింటాలు, మొత్తం 1600 క్వింటాల వేరుశనగ విత్తన కాయలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. వేరుశెనగ విత్తన కాయలను ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ పై అందించనున్నట్లు తెలిపారు. 30కేజీల బస్తా (కే6-రూ.1710, నారాయణిరూ.1746)ధరకు అందించ డానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. త్వరలోనే వేరుశనగ విత్తన కాయాలను పంపిణీ చేస్తామని తెలిపారు

## ఘనంగా బసవ జయంతి

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బసవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వీరశైవ గురు జంగమ్మ లింగాయతి సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు భీమలింగస్వామి బసవేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఎడ్లబండిపై బసవేశ్వరుని చిత్రపటాన్ని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు కలశాలు పట్టుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. గ్రామోత్సవం వెంబడి కోలాటం ప్రత్యేకంగా ఆకట్టుకుంది..

# క్రైం కార్నర్



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో అరెస్టు అయిన మహిళతో పోలీసులు

## నాటుసారాతో పట్టుబడ్డ మహిళ అరెస్టు

**ప్రజాశక్తి-మదనపల్లె**

స్థానిక నక్కలదిన్ని తాండాలో వన్ టౌన్ పోలీసులు నిర్వహించిన నాకాబందిలో నాటుసారా కలిగిన ఉన్న మహిళను అరెస్టు చేసినట్లు సిఐ వల్లిబాషా తెలిపారు.ఎస్‌పి కృష్ణరావు, డిఎస్‌పి ప్రసాదరెడ్డి ఉత్తర్వులతో సోమవారం స్థానిక నక్కలదిన్నె తాండాలో నాకాబంది చేపట్టామని అన్నారు. అనుమానిత ప్రదేశాలు, ఇళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా బుక్కే రాములమ్మ(29) ఇంటి వద్ద సారా అమ్ముతూ పట్టుబడగా,15 లీటర్లసార సీజ్ చేసి, కేసు నమోదు అనంతరం అరెస్టు చేసినట్లు తెలిపారు.

## భూవివాదంలో కేసు నమోదు

**ప్రజాశక్తి-గాలివీడు**

భూ వివాదం కేసులో రెండు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని ప్యారంపల్లి గ్రామం కోట కాడపల్లెకు చెందిన కుర్రపోతుల వెంకటమ్మకు వారి గ్రామంలోని సర్వేనెంబర్ 808/4లో ఒక ఎకరా డీకేటి భూమి ఉందన్నారు. ఈ భూమిని ఆమె కుమారులైన కుర్రపోతుల చిన్నారెడ్డప్ప, కుర్రపోతుల పెద్ద రెడ్డప్పలు అదే గ్రామానికి చెందిన తోట మల్లికార్జునకు 2020 సంవత్సరంలో రూ.1.5 లక్షలకు విక్రయించారని చెప్పారు. ఈ క్రమంలో కుర్రపోతుల చిన్న రెడ్డప్ప, పెద్ద రెడ్డప్ప, వారి బంధువులైన బత్తల రమణయ్య ఈ భూమి తమదని మీరెవరు ఇక్కడికి వచ్చి పంట వేయ వద్దని సోమవారం మల్లికార్జున, తోట రామాంజులు, తోటరాం బాబులతో ఘర్షణకు దిగారని అన్నారు. ఈ గొడవలో బత్తుల రమణయ్యను కొడవలితో కుడి భుజం మీద కొట్టగా రక్త గాయాలు అయ్యాయని వెంటనే108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ వివాదంలో ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.